కియారా ఖన్నా, నాని

అందాలొలికే గాజు బొమ్మ

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్నది. డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకురానుంది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నడిచే కథాంశమిది. నాని కూతురు పాత్రలో బేబీ కియారా ఖన్నా నటిస్తున్నది. ఈ సినిమాలోని రెండో గీతం 'గాజు బొమ్మ' ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కథలోని ఆత్మను ఆవిష్కరిస్తూ తండ్రీకూతుళ్ల అనుబంధానికి దర్పణంలా ఈ పాట ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సానుజాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, దర్శకత్వం: శౌర్యువ్.

'తలైవా 170'లో రానా

'జైలర్' చిత్రంతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నారు అగ్ర హీరో రజనీకాంత్. ఆయన తదుపరి చిత్రానికి 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించబోతున్న విషయం తెలిసిందే. రజనీకాంత్ నటిస్తున్న 170వ చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమాలో తెలుగు యువ హీరోలు నాని లేదా శర్వానంద్ భాగం కాబోతున్నారని కొద్ది రోజుల క్రితం వార్తలొచ్చాయి. ఆ తర్వాత రానా పేరు కూడా వినిపించింది. తాజాగా ఈ సినిమాలో రానా నటించబోతున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆయన రాకతో 'తలైవా 170' చిత్రం మరింత ఆసక్తికరంగా మారిందంటూ ట్వీట్ చేసింది. ఈ సినిమాలో బిగ్ బి అమితాబ్ బచ్చన్ కూడా నటించనున్నారు. దాదాపు 32 ఏళ్ల విరామం తర్వాత అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ కలిసి నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో మంజూ వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కథానాయికలుగా ఖరారయ్యారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది.

రామ్‌చరణ్

చట్టం, న్యాయం అతడే!

ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'గేమ్ ఛేంజర్' ఒకటి. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న ఈ చిత్రం విడుదల ఆలస్యమవుతుండటంతో మెగా అభిమానులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. అయితే.. వాళ్ల ఆవేశం చల్లబడేలా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. ఇందులో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. చరణ్ ఐపీఎస్ అధికారిగా, ఐఏఎస్ అధికారిగా రెండు బాధ్యతల్లో కనిపిస్తారట. ఓకే సినిమాలో హీరో పోలీస్‌గా, కలెక్టర్‌గా కనిపించడం ఇప్పటివరకూ ఇండియన్ సినిమా హిస్టరీలో జరగలేదని చెప్పొచ్చు. ఇంకా అభిమానుల ఊహకందని ఎన్నో విశేషాలతో దర్శకుడు శంకర్ 'గేమ్‌ఛేంజర్' సినిమాను రూపొందిస్తున్నారని తెలిసింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సిద్ధార్థ్

సినిమా నచ్చకపోతే ఇక తెలుగులో కనిపించను

' 'చిన్నా' సినిమాను తెలుగులో విడుదల చేయాలనుకున్నప్పుడు 'సిద్ధార్థ్ సినిమాలు ఎవరు చూస్తారు?' అంటూ కొందరు హేళనగా మాట్లాడారు. ఈ రోజు చెబుతున్నాను వినండి.. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చకపోతే ఇక నేను ఇక్కడకు రాను. ప్రెస్‌మీట్లు పెట్టను' అని భావోద్వేగానికి లోనయ్యాడు హీరో సిద్ధార్థ్. ఆయన కథానాయకుడిగా నటించి, నిర్మించిన సినిమా 'చిన్నా'. అంజలి నాయర్, నజయన్ ముఖ్యపాత్రలు. ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకుడు. తమిళంలో 'చిత్త' పేరుతో విడుదలై బాగా ఆడుతున్న ఈ సినిమాను 'చిన్నా'గా తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిద్ధార్థ్ మాట్లాడారు. 'బాబాయి, కూతురు మధ్య ఉండే అనుబంధమే ఈ సినిమా. ఇలాంటి కథలో చేయాలనేది నా 22ఏళ్ల కల. ఇన్నాళ్లకు నెరవేరింది. నా కెరీర్‌లో ఇదే బెస్ట్ మూవీ. నేనింకా నటుడిగా ఎందుకు కొనసాగాలో ఈ సినిమా చెబుతుంది. తమిళంలో ఆదరిస్తున్నారు. తెలుగులో కూడా ఆదరిస్తారని నమ్ముతున్నా' అని ఆశాభావం వ్యక్తం చేశారు సిద్ధార్థ్. మరికొన్ని విషయాలు చెబుతూ 'మొదట అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని నాలుగు నెలల కిందటే సెన్సార్ చేశాం. ఈ సినిమాకోసం కన్నడ నేర్చుకోవటమేకాక, అక్కడి మైసూర్ స్లాంగ్‌ని ప్రాక్టీస్ చేశాను. కన్నడ వెర్షన్‌కి సొంతంగా డబ్బింగ్ చెప్పాను. కర్ణాటక వెళ్లి ప్రెస్‌మీట్ పెడితే..'తమిళంవాడివి ఇక్కడ నీకేం పని.. గెటవుట్' అన్నారు. నేను కన్నడను గౌరవించాను. ఆ గౌరవంతోనే భాష నేర్చుకున్నాను. కన్నడవాడిగా వాళ్లముందుకెళ్తే వాళ్లు నన్ను అవమానించారు. వాళ్ల అమాయకత్వాన్ని చూసి నవ్వుకున్నా' అన్నారు సిద్ధార్థ్. 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్న ఏషియన్ సునీల్‌గారికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. ఈ సినిమా నా జీవితం. సినిమాపై నమ్మకం, ఇష్టం ఉంటే థియేటర్‌కెళ్లి సినిమా చూడండి. ఈ సినిమా చూశాక కూడా నచ్చకపోతే ఇక తెలుగులో కనిపించను. ఈ 22ఏళ్ల నా కెరీర్‌లో సిద్ధార్థ్ బయటవాడు అనే మాట తెలుగునేలపై రాలేదు. రాదనే అనుకుంటున్నా. నా పేరు సిద్ధార్థ్. నేను చిన్నా అనే సినిమా తీశాను.. మీరందరూ చూడాలి. చూస్తారు' అంటూ ఉద్వేగానికి లోనయ్యారు సిద్ధార్థ్.

దళపతితో జోడీగా..

పంజాబీ సొగసరి మీనాక్షి చౌదరి ప్రస్తుతం తెలుగులో భారీ అవకాశాలతో సత్తా చాటుతున్నది. టాలీవుడ్‌లో రెండేళ్ల క్రితమే అరంగేట్రం చేసినప్పటికీ ఈ ఏడాది మాత్రం ఈ అమ్మడికి బాగా కలిసొచ్చింది. మహేష్‌బాబు సరసన 'గుంటూరు కారం'లో నాయికగా చోటు దక్కించుకొని ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుణ్‌తేజ్, విశ్వక్‌సేన్ చిత్రాల్లో కథానాయికగా ఖరారైంది. ఇదే జోరులో ఈ భామ తమిళంలో దళపతి విజయ్ సరసన నటించే బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. విజయ్ తాజా చిత్రం 'లియో' దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా అనంతరం వెంకట్‌ప్రభు దర్శకత్వంలో విజయ్ ఓ చిత్రాన్ని చేయబోతున్నారు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరిని రెండో నాయికగా ఎంపిక చేశారు. ప్రధాన హీరోయిన్‌గా ప్రియాంక అరుళ్ మోహన్ నటించనుంది. ఈ చిత్రంలో విజయ్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారు. రెండో పాత్రకు జోడీగా మీనాక్షి చౌదరిని ఎంపిక చేసినట్లు తెలిసింది. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

ప్రేక్షకులు టెన్షన్స్ మరచిపోతారు

'ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. నేను మూడు పాత్రల్లో కనిపిస్తా. కథలో కొత్తదనంతో పాటు వినోదం కూడా మరో స్థాయిలో ఉంటుంది. ఈ సినిమా చూస్తూ ప్రేక్షకులు టెన్షన్స్ అన్నింటిని మరచిపోతారు' అన్నారు సుధీర్‌బాబు. ఆయన కథానాయకుడిగా హర్షవర్ధన్ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'మామా మశ్చీంద్ర. సునీల్ నారంగ్, పూస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. ఈ నెల 6న విడుదలకానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకకు నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'అమ్మకు సంబంధించిన కథ ఇది. హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి' అన్నారు. మూడు గెటప్స్‌లో హీరో సుధీర్ నటన ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని నిర్మాతలు తెలిపారు. హర్షవర్ధన్ కామెడీ టైమింగ్ బాగుంటుందని, ఈ సినిమా ద్వారా అతను దర్శకుడిగా పేరు తెచ్చుకుంటాడని ముఖ్య అతిథిగా విచ్చేసిన శేఖర్ కమ్ముల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హీరోలు విశ్వక్‌సేన్, శ్రీవిష్ణు, శర్వానంద్ పాల్గొన్నారు.



నవీన్, అనంతిక, సంగీత్ శోభన్

'మ్యాడ్' అంటే ఓ ప్రశంస

నార్నే నవీన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీప్రియా, అనంతిక సునీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'మ్యాడ్'. కల్యాణ్ శంకర్ దర్శకుడు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ని మంగళవారం హైదరాబాద్‌లో జూనియర్ ఎన్టీయార్ విడుదల చేశారు ఈనెల 6న సినిమా విడుదల కానున్న సందర్భంగా ఇందులోని ప్రధానపాత్రధారులంతా విలేకర్లతో ముచ్చటించారు. 'హ్యాపీడేస్'లా ఉంటుందా? అనడిగితే ' 'హ్యాపీడేస్' వచ్చి పదిహేనేళ్లయింది. అది అప్పటి జనరేషన్‌కి కనెక్టయిన సినిమా. ఇది ఇప్పటి జనరేషన్‌కి కనెక్టయ్యే సినిమా. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విటర్ ఎంజాయ్‌చేసే జనరేషన్ ఇది. అలాంటివారికి నచ్చే సినిమా ఇది. థియేటర్స్‌లో ఫుల్ లాఫ్ హంగామా అని చెప్పొచ్చు' అని సంగీత్ శోభన్ చెప్పారు. ' 'మ్యాడ్' అంటే ఓ ప్రశంస. ఇది పిచ్చిగా నవ్వించే సినిమా కాబట్టే 'మ్యాడ్' అని పేరుపెట్టారు. 'డీజే టిల్లు' దర్శకుడు విమల్ కృష్ణ ఈ కథ విని 'మ్యాడ్' అని ప్రశంసించారు. ఆ ప్రశంస నచ్చే మా దర్శకుడు 'కల్యాణ్‌శంకర్' ఈ సినిమాకు 'మ్యాడ్' అనే టైటిల్ పెట్టారు' అని రామ్ నితిన్ చెప్పారు.

రామ్మోహన్ రావు, శ్రీవిష్ణు, ఈషా రెబ్బా, సుధీర్‌బాబు, శర్వానంద్, హర్షవర్ధన్

మీరింత ఖాళీగా ఉన్నారా?

సమంత, చైతూ కలిసి ఉన్న రోజుల్లో ఒక కుక్కపిల్లను పెంచుకున్నారు. ఆ కుక్కపిల్ల పేరు హష్. ఈ జంట విడిపోయిన తర్వాత తను ప్రాణానికి ప్రాణంగా చూసుకునే హష్‌ని కూడా వెంటబెట్టుకొని తీసుకెళ్లిపోయింది సమంత. గత కొన్నేళ్లుగా సమంత ఇన్‌స్టా రీల్స్‌లో కూడా హష్ దర్శనమిస్తూనేవుంది. నిజానికి ఈ కుక్క సమంత, చైతూ దగ్గర తప్ప ఎక్కడా ఉండదని తెలిసింది. రీసెంట్‌గా ఓ అభిమాని కొత్తగా కొన్న బైక్‌ని నాగచైతన్య టెస్ట్ డ్రైవ్ చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ వీడియోలో అనుకోకుండా హష్ దర్శనమిచ్చింది. దీంతో గాసిప్ రాయుళ్లకు పని దొరికినట్లయింది. 'ఏంటి?.. కుక్క చైతూ దగ్గరుంది.. మళ్లీ ఇద్దరు కలిశారా ఏంటి? అంటూ కామెంట్లు పెడుతున్నారంట. దీంతో సామ్‌కి చిర్రెత్తుకొచ్చి ' మీరు ఇంత ఖాళీగా ఉన్నారని నాకు తెలియదు. కనీసం ఏదైనా బుక్ అయినా చదువుకోపోయారా?.. జ్ఞానం వస్తుంది.' అంటూ సున్నితంగా మందలించారు సమంత.

సమంత

నవీన్‌చంద్ర

తాగుబోతుల లైఫ్‌స్టైల్ తెలుసుకున్నా!

' మంత్ ఆఫ్ మధు' నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా. ఇందులో నా పాత్రది పెక్యులర్ మనస్తత్వం. ఉద్యోగం చేయడమంటే ఇష్టపుండదు. ఏదైనా బిజినెస్ చేయటానికి టైమ్ ఉండదు. తాగుతూ బాధ్యత లేకుండా తిరుగుతూ ఉంటా. అలాంటి నా జీవితం ఎలాంటి మలుపు తీసుకుంది అనేది ఇందులో ఆసక్తిని కలిగించే అంశం' అన్నారు. నవీన్‌చంద్ర. కలర్స్ స్వాతితో కలిసి ఆయన నటించిన సినిమా 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకుడు. యశ్వంత్ ములుకుట్ల నిర్మాత. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది. నవీన్‌చంద్ర విలేకరులతో ముచ్చటించారు. ఈ కథ చెప్పినప్పుడు మారుమాట్లాడకుండా ఒప్పుకున్నా. నిజానికి అప్పటికే నేను చాలా బిజీ. అయినా సరే ఈ కథ, అందులోని నా పాత్ర నాకు బాగా నచ్చేశాయి. ఇందులో నా పాత్ర సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. తాగుబోతుగా కనిపిస్తాను. దానికోసం అలాంటి లైఫ్‌స్టైల్ ఉన్నవాళ్లను దగ్గరగా చూశాను. ఆ బాడీలాగ్వేజ్ కోసం చాలా కష్టపడ్డాను' అని చెప్పుకొచ్చారు నవీన్‌చంద్ర. 'ఇందులో నా పేరు మధుసూదనరావు, శ్రేయ అనే కొత్త మ్యాయి అమెరికానుంచి వచ్చిన మధుమతి పాత్ర చేసింది. 'మంత్ ఆఫ్ మధు' అనేది మా ఇద్దరికథ. మా ఇద్దరి వల్ల స్వాతి ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నదనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. పనిచేసిన అందరికీ మంచిపేరు తెచ్చిపెట్టే సినిమా ఇది.' అన్నారు నవీన్‌చంద్ర.

శ్రీరాజ్ బల్లా, మురళీమోహన్, విజయ మాధవి

ప్రేమలో పావలు బాబులు..

అభినవ్ హీరోగా నటిస్తున్న చిత్రం '(ప్రేమలో..'. 'పావలు బాబులు' ఉపశీర్షిక. శ్రీరాజ్ బల్లా దర్శకుడు. విజయమాధవి బల్లా నిర్మాత. ఈ సినిమా మోషన్ పోస్టర్ విడుదల కార్యక్రమం సీనియర్ నటుడు మురళీమోహన్ చేతులమీదుగా హైదరాబాద్‌లో జరిగింది. పేరుతోపాటు కాన్సెప్ట్ కూడా కొత్తగా ఉందని, సినిమా విజయం సాధించాలని మురళీమోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా విజయం సాధించాలని అతిథులందరూ ఆకాంక్షించారు. ప్రేక్షకుల ఆశీర్వాదం ఉంటే మున్ముందు మరిన్ని మంచి సినిమాలు తీస్తామని నిర్మాత చెప్పారు. ఇంకా తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నిర్మాత సాయివెంకట్, నటుడు సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ఫుల్ పోలీస్ కథ

రాకేష్ వర్రే కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించివర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''బాహుబలి, ఎవ్వరికీ చెప్పొద్దు వంటి సినిమాల ద్వారా రాకేష్ వర్రే ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు. ఈ సినిమాలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపిస్తారు. అసాంఘిక శక్తులపై అతని పోరాటం ఏమిటన్నది తెరపై చూడాల్సిందే. దర్శకుడు దాదాపు ఆరు నెలల పాటు ఆడిషన్స్ నిర్వహించి చివరకు హీరోగా రాకేష్ వర్రేను ఎంపిక చేశారు. ఆయనకు గుర్తింపు తెచ్చే చిత్రమవుతుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీసుందర్, దర్శకత్వం: విరించివర్మ.

అడవిలో ఏంజరిగింది?

తలకోన అడవిలోకి కొందరు స్నేహితులతో ఓ అమ్మాయి వెళ్తుంది. ఎంతమంది వెళ్లారు. ఎంతమంది తిరిగొచ్చారు? అనే ప్రధానాంశంతో రూపొందిన చిత్రం 'తలకోన'. అప్సర రాణి కథానాయికగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు నగేశ్ నారదాసి. దేవర శ్రీధర్‌రెడ్డి నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ ' ప్రకృతి అందాలేకాదు, ప్రకృతిలోని వికృత స్వరూపంకూడా ఇందులో కనిపిస్తుంది. పాలిటిక్స్‌ని కూడా మిక్స్‌చేసి చూపించాం. నవంబర్ తొలివారంలో సినిమాను విడుదల చేస్తాం'' అని చెప్పారు. ఇంకా నిర్మాత కూడా మాట్లాడారు. అశోక్‌కుమార్, అజయ్‌ఘోష్, ఉగ్రం మంచు, విజయ్ రంగరాజు, రాజారాయ్, యోగి కత్రి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, సమర్పణ: స్వప్న శ్రీధర్‌రెడ్డి.